ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025
5
అనంతపురం





దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

'దిశా' సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సక్రమంగా అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని అనంతపురం పార్లమెంట్ సభ్యుడు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) ఛైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డిపిఆర్‌సి సమావేశాలు భవనంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రం నిధులతో చేపట్టిన పనులను త్వరిగత గతిన పూర్తి చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు. జాతీయ రహదారులకు సంబంధించి కొత్త ప్రతిపాదనలు బెంగళూరు నుండి హైదరాబాద్ 6 లైన్లో రోడ్లు, బాగేపల్లి బ్లాక్ స్పాట్‌గా గుర్తించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు వరలక్ష్మి, పెద్దన్న, చంద్రశేఖర్ రెడ్డి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ఉత్సవం.. చైతన్య భరితం..!

అనంతలో ఐద్వా సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆలోచింపజేసిన ఫొటో ప్రదర్శన

మహిళా సమానత్వంతో సమాజాభివృద్ధి

సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు

మహిళా శక్తిపై విద్యార్థిని ఉద్యమ నినాద ప్రదర్శన

విద్యార్థిని కర్రసాము

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సాంస్కృతిక ఉత్సవం చైతన్యభరితంగా ప్రారంభం అయ్యింది. అనంతపురం జిల్లాలో ఈ నెల 13,14,15వ తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల నేపథ్యంలో గురువారం నుంచి నగరంలోని కృష్ణ కళామందిరంలో సాంస్కృతిక ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. తొలి రోజు ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం అయ్యింది. సమాజంలో మహిళ వివక్ష.. వేధింపులు.. దాడులు.. వరకట్న దురాచారం తదితర వాటిని తెలియజేస్తూ ఫొటోలను ప్రదర్శించారు. మహిళలు సాధించిన అభివృద్ధి, వారి ఫొటోలను సైతం ప్రదర్శించారు. సాంస్కృతిక ఉత్సవాల్లో మహిళలు, విద్యార్థినులు ప్రదర్శన చేశారు. కోలాటం.. కర్రసాము, భరతనాట్యం తదితర కళాప్రదర్శనలు కొనసాగాయి. సాంస్కృతిక ప్రదర్శన ఆద్యంతం చూపరులను కట్టిపడేసింది.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరంలో సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నాలుగు రోజుల పాటు సాగే కళా సాంస్కృతి ఉత్సవాలు, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ ప్రారంభించారు. అనంతరం కళా సాంస్కృతిక ఉత్సవాలను సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు, అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోల ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు సరళ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మహిళా సమానత్వంతో సమాజాభివృద్ధి

స్త్రీ పురుషులు సమానంగా గుర్తిస్తూ వారికి సమాన హక్కులు కల్పించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు తెలియజేశారు. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని అనాడే గురజాడ అప్పారావు చెప్పారన్నారు. ప్రజా సంస్కృతినే ప్రత్యామ్నాయంగా నిలబెట్టుకోవాల్సిన సమయం ప్రస్తుతం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో ఆడ మగ అన్న తేడాలేకుండా పిల్లలను సమానంగా పెంచి సమాన హక్కులు కల్పించాలన్నారు. మహిళలు చైతన్యవంతంగా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న ముఖ్య అతిథి సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు

రాజకీయం, సంస్కృతి రెండు ఒక్కటే అన్నారు. రెండింటిని అర్థం చేసుకుని మహిళలు ముందుకు సాగాలన్నారు. సమానత్వాన్ని ప్రతిభింబించే సినిమాలు ఎన్నో వచ్చాయని వాటిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు.

◆ అనంతపురం డిఆర్ఒ మలోల మాట్లాడుతూ సమాజానికి మహిళా సాధికారత ఎంతో అవసరం అన్నారు. ఎన్ని చట్టాలున్నా నేటికీ మహిళలపై వివక్ష, అత్యాచారాలు, దాడులు చోటు చేసుకోవడం విచారకరం అన్నారు. ఐద్వా లాంటి సంఘాలు మహిళల హక్కుల కోసం పోరాడుతూ చైతన్యం కల్పిస్తుండటం అభినందనీయం అన్నారు. మహిళల హక్కుల రక్షణకు చట్టాలు అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం అండదండగా నిలుస్తోందన్నారు.



కోలాటం ఆడుతున్న చిన్నారులు

◆ స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఐద్వా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఎంతో ఆలోచింపచేసేలా ఉందన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారని తెలిపారు. లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ సమాజంలో మహిళల పక్షాన ఐద్వా చేస్తున్న పోరాటం ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి చైతన్య కళా ప్రదర్శనలు సమాజానికి ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు.

◆ ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహసభలు ఈ నెల 13, 14, 15 తేదిలోల నిర్వహిస్తున్న నేపథ్యంలో నేటి నుంచి 12వ తేది వరకు చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గేట్స్ కళాశాల అధినేత్రి పద్మావతి, డాక్టర్ ప్రసూన్, డాక్టర్ ప్రగతి, యుటిఎఫ్ నాయకురాలు దేవేంద్రమ్మ, ప్రమీళ, రాష్ట్ర నాయకులు రమణయ్య, ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, క్రిష్ణమూర్తి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎస్‌ఎఫ్ఐ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళా వైద్యులు, ప్రముఖులు



ఆటకట్టుకున్న ప్రదర్శన



ప్రదర్శనలను సెల్‌ఫోన్లో బందిస్తున్న యువత



ఆర్ఐఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులపై ఫీజుల ఒత్తిడిని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల గిరి, ఓతూరు పరమేష్

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి తీసుకొస్తున్న కళాశాలలపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల గిరి, ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని ఆర్ఐఒ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 80 శాతం ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజుకు అనుమతిస్తామని, ప్రాక్టికల్స్ రికార్డులు ఇస్తామని విద్యార్థులను ఒత్తిళ్లకు గురి చేస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై కేవలం నాలుగు నెలలు మాత్రమే అయిన నేపథ్యంలో కళాశాల యాజమాన్యం మొత్తం ఫీజులో 80 శాతం ఫీజు చెల్లిస్తే పరీక్ష ఫీజు అనుమతిస్తాని చెప్పడం బాధాకరమన్నారు. ఫీజులు కట్టలేని విద్యార్థులను కళాశాల బయట నిలబెట్టడం, తరగతి గదిలో లేపి అవమానించడం వంటి నీచమైన చర్యలకు పాల్పడటం తగదన్నారు. ఆయా విషయాలన్నీ ఇంటర్మీడియట్ ఆర్ఐఒ వెంకటరమణనాయక్‌కు తెలిసినప్పటికీ విద్యార్థులతో మాట్లాడటంగానీ, సర్క్యులర్‌ను జారీ చేయకపోవడంగానీ చూస్తుంటే సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ఆర్ఐఒ స్పందించి విద్యార్థులను మానసికంగా వేధింపులు గురి చేస్తున్న నారాయణ, ఎస్ఆర్, శ్రీచైతన్య, తదితర కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

ఉమ్మడి 'అనంత'లో 58 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిలిచిపోనున్న సేవలు

ప్రజాశక్తి అనంతపురం

ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైంది. ఇంతకాలం కాళ్లు ఈడ్చుకుంటూ కాలం వెళ్లదీసిన ఆసుపత్రులు ఇక కాలు కదపలేని పరిస్థితుల్లో ఉన్నాయి. అందుకే ఈనెల 10వతేదీ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆషా) నిర్ణయించింది. ఇంతకాలం ఏదో విధంగా పంటి బిగువున కష్టాలను భరిస్తున్నాగానీ, ఇక ఎంత మాత్రం భరించలేకపోతున్నామని నర్సింగ్ హోమ్స్ యాజమాన్యాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లాలో 46, సత్యసాయి జిల్లాలో 12 ఆసుపత్రిలో పరిధిలో సుమారుగా రూ.125 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

మంత్రి ఇలాఖాలో...

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్వయానా నెట్‌వర్క్ ఆసుపత్రుల బకాయిలను చాలా స్పష్టంగా అసెంబ్లీలో ప్రకటించారు. కానీ చేతల్లో మాత్రం ఫలితం కనిపించటం లేదు. ఈనేపథ్యంలో గత సెప్టెంబరు 25న సమావేశమైన ఆషా రాష్ట్ర కార్యవర్గం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించింది. దీని అనుగుణంగానే ఈనెల 10వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్యసేవలను నిలిపివేయాలని ఆసుపత్రులు నిర్ణయించాయి. ఆషా కార్యవర్గం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు ట్రస్ట్ ఉన్నతాధికారులకు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయి పరిష్కారం కనిపించలేదు. ఏడాది కాలంగా తాము పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజలంతా అర్థం చేసుకుంటారని భావిస్తున్నామని, సహకరించి అండగా నిలవాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

ప్రజలపై భారాలు తగ్గిస్తున్నాం..!

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

జీఎస్టీ పన్నుల తగ్గింపు ద్వారా రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్దనున్న మాసినేని గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌లో భాగంగా అధికారులు, డీలర్లతో గురువారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కారక్రమంలో మంత్రితో పాటు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ హేమ, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేషాంజనేయులు, సెక్రెటరీ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన్ నేషన్ – వన్ ట్యాక్స్ అమలు చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రతి కుటుంబానికి దాదాపు సంవత్సరానికి రూ.18 నుంచి 20 వేలు ఆదా అవుతుందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ కేంద్రంలో ఎన్డీఏ సహకారంతో రాష్ట్రానికి అనేక రకాల లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు.

మెడికల్ షాపుల వద్ద అవగాహన

అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న శివశంకర్, రూప మెడికల్ షాపుల్లో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ లో భాగంగా ధరల తగ్గింపుపై ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యర్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపి అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ ఆనంద్ పాల్గొని జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే అస్మిత్

యాడికి : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బోయరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో పెన్షన్లు, తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను స్థానికులు విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీర్లు రామ్‌గోపాల్‌రెడ్డి, యల్లంనాయుడును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరురంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హరి, రవికుమార్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు నాగేశ్వరరావు, పెద్దయ్య, రామకృష్ణ, కృష్ణమూర్తి, బయపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

పాత మహిళా పోలీస్ స్టేషన్ పరిశీలన

అనంతపురం : నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు సమీపంలో ఉన్న పాత మహిళా పోలీసుస్టేషన్ భవనాన్ని ఎస్పీ పి.జగదీష్ గురువారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో కొన్నేళ్ల నుంచి ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా నిలిపివేశారు. విలువైన ఆ ప్రాంతంలో సదరు పాత భవనాలను తొలగించి ఆ స్థలంలో నూతన భవనాలను నిర్మిస్తే జిల్లా పోలీసుశాఖకు ఉపయోగంగా ఉంటుందని భావించిన సిబ్బందితో కలిసి సిబ్బంది క్వార్టర్స్, ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు శ్రీకాంత్, వెంకటేష్‌నాయక్, ఆర్ఐ మధు, ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

ఓఎంసీ హద్దులపై కమిటీ



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సరిహద్దులు తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా సరిహద్దు డీ.హీరేహాళ్ మండలంలో ఇనుప ఖనిజం అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసింది. ఈ మేరకు గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామం పరిధిలో ఇనుప ఖనిజం గనులుండేవి. ఈ గనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలొచ్చాయి. అనంతరం దీని యజమాని గాలి జనార్ధన్‌రెడ్డితోపాటు అనేక మందిపై సిఐబి కేసులు నమోదు చేసింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా పక్కపక్కనే ఉన్న గనుల్లో అక్రమంగా తవ్వకాలు జరిగినట్టు ఆరోపణలు న్నాయి. అదికూడా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో అటువైపు, ఇటువైపు గనులున్నాయి. ఈ సరిహద్దులను చెరిపేసి ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ సంస్థ పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు జరిపిందన్నది అభియోగం. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రిటైర్డు జస్టిస్ సుదన్శు దుల్వాయి నేతృత్వంలో కమిటీని వేసింది. ఆయన ఆధ్వర్యంలో తోడ్పాటును అందించేందుకు రాష్ట్రస్థాయిలో నిపుణులను ఆ కమిటీలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు ఉత్వర్వులు జారీ చేసింది.

జస్టిస్ సుదాన్శు దుల్వాయి ఈ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మొత్తం ఆరుగురు సభ్యులతో ఈ కమిటీ ఉంటుంది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నుంచి కేంద్ర ప్రభుత్వం ఒకరిని నామినేట్ చేస్తుంది. సెంట్రల్ ఎంపవర్డు కమిటీ నుంచి ఒక నామినీ ఉంటారు. అనంతపురం డిఎఫ్ఒ గరుప్రభాకర్ ఒకరు సభ్యులుగా ఉంటారు. సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుంచి డైరెక్టర్ ఒకరు సభ్యులుగా ఉంటారు. భూగర్భ గనుల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారు. అనంతపురం జిల్లా కలెక్టర్, ల్యాండ్ సర్వే నుంచి కర్నూలు ఆర్‌జెడి వెంకటేశ్వర్లు సహాయ, సహకారాలందిస్తారు. ఇలా ఈ కమిటీ రెండు మాసాల్లో గనుల లీజులతోపాటు, వాటి సరిహద్దులు తేల్చడం, అందులో మైనింగ్‌లో జరిగిన అవకతవకలేమైనా ఉంటే గుర్తించి సుప్రీంకోర్టుకు నివేదికను అందజేస్తారు.



గతంలో సుప్రీంకోర్టు చర్యలు

గతంలోనే సరిహద్దులు తేల్చేందుకు సర్వే ఆఫ్ ఇండియాకు ఆదేశించింది. 2010లో ఇది జరిగింది. మైనింగ్ సరిహద్దులు గుర్తించి నివేదికను కోరింది. ఇందులో ఓవర్‌ల్యాపింగ్ స్కెచెస్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దులను గుర్తించేందుకు ఆదేశించింది. 2023లో ఈ కేసును గ్రీన్ బెంచ్‌కు బదిలీ చేసింది. తాజాగా ఇప్పుడు గనుల సరిహద్దులు సరిగాలేవని, మైనింగ్ అక్రమాలు జరిగాయన్న దానిపై ఇప్పుడు రిటైర్డు జస్టిస్ దుల్వాయి అధ్యక్షతన కమిటీని వేసింది. ఈ కమిటీ రెండు మాసాల్లోపు నివేదికను సుప్రీంకోర్టుకు అందజేయాల్సి ఉంటుంది.

చోరీల నివారణకు వ్యాపారులు సహకరించాలి

పోలీస్ ఇన్స్పెక్టర్ జయనాయక్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంతోపాటు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో చోరీలు జరగకుండా నివారించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని రాయదుర్గం పోలీస్ ఇన్స్పెక్టర్ జయనాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం రాత్రి ఓబులాచారి రోడ్డు వద్ద ఓ షెడ్డులో, శనివారం 15వ ఎన్నికల వార్డు ఇందిరమ్మ కాలనీలో మూడిళ్లలో చోరీలు, ఉడేగోళం బైపాస్ రోడ్డు వద్ద షెడ్డులో చోరీతోపాటు తరచూ దొంగతనాలు, చోరీలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారన్నారు. ఇళ్లతాళాలు పగులగొట్టి బీరువాల్లో నిల్వ ఉంచిన నగదు, బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్తున్నారన్నారు. షెడ్లు, బంకులు ఇతర పెట్టెల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వెనుక వైపు ఉన్న ఇనుప రేకులను కత్తిరించి లోనికి ప్రవేశించి నిల్వ ఉంచిన నగదు, సిగరెట్లు, వివిధ విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారన్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లేటప్పుడు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఉంచుకూడదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లాల్సి వచ్చిన పక్షంలో పోలీసులకు ఇస్తే ప్రత్యేక గస్తీ నిఘ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో సిబ్బంది కొరత ఉందని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పరిటాల కుటుంబాన్ని విమర్శిస్తే ఊరుకోం..

ప్రజాశక్తి-ఆత్మకూరు



విలేకరులతో మాట్లాడుతున్న బోయ శ్రీనివాసులు

పరిటాల కుటుంబంతోపాటు బండి పరశురామ్‌పై విమర్శలు చేసే అర్హత లేదని అనర్హుల భూములను లాక్కున్న వైసిపి నాయకులు చెన్నారెడ్డికి లేదని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం పార్టీలు మారే చెన్నారెడ్డి అధికారుకు సాయాన్ని మరిచి ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బి.యాలేరులో మీ మామ భూములను అక్రమంగా ఆన్‌లైన్ ఎక్కించుకున్న నీవు విమర్శలు చేస్తుంటే 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. బండి పరశురామ్ భూమి విషయంలో అన్నదమ్ములు మధ్య పెద్ద మనిషిగా వ్యవహరించి నీవుకూడా అని ప్రశ్నించారు. 2014 నుంచి పరిటాల కుటుంబం ఇంటి గేట్ల వద్ద రాజకీయం చేసుకొని వారు పెట్టిన భిక్షతో పైకి వచ్చి ఇప్పుడు వైసిపిలోకి వెళ్లి వారిపైనే విమర్శలు చేయడం బాధాకరమన్నారు. చెన్నారెడ్డి ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పొగాకుకు దూరంగా ఉండాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-అనంతపురం

యువత పొగాకుకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 3.0'ను జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రజలందరూ పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ యుగంధర్, పరిపాలన అధికారి గిరిజ మనోహర్, మలేరియా అధికారి ఓబులు, డెమో సిబ్బంది నాగరాజులు, త్యాగరాజు, గంగాధర్, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఎన్‌సిడి సిబ్బంది ప్రేమ్, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు, కిషోర్, శశి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి, సిబ్బంది

పుట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడిగా గోవర్ధన్‌రాజు



పుట్లూరు : పుట్లూరు సింగిల్‌విండో అధ్యక్షునిగా కడవ కల్లు గ్రామానికి చెందిన గోవర్ధనరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రాజు మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సిఎంచంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడే వారికి టిడిపి అండగా ఉంటుందనేందుకు గోవర్ధనరాజు నిదర్శనమని టిడిపి మండల నాయకులు చెర్లోపల్లి బ్రహ్మయ్య అన్నారు.

పుస్తకాల వితరణ

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థి, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రమూర్తి గురువారం దాదాపు 110 రసాయన శాస్త్ర పుస్తకాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, యోగీశ్వరనాయుడు, రసాయన శాస్త్ర విభాగాధిపతి యు.శివరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఉపకరణాల శిబిరం

రాయదుర్గం : దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ చేసేందుకు శుక్రవారం రాయదుర్గంలోని ఎపి మోడల్ హైస్కూల్లో నిర్వహించనున్న ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయదుర్గం మండల విద్యాశాఖ అధికారులు ఇర్షాద్ మహమ్మద్, వెంకట రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష విద్యాశాఖ, ఎఎల్ఐ ఎంసిఒ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఉచిత అసెస్మెంట్ శిబిరాన్ని విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభిస్తారన్నారు. పట్టణంతోపాటు రాయదుర్గం మండల దివ్యాంగ విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో వచ్చి ఉచిత ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

రాయదుర్గం : నియోజకవర్గం పరిధిలోని అర్హులకు ప్రభుత్వ సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు గౌని ప్రతాపరెడ్డి కోరారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలం గోనేహాల్ గ్రామానికి చెందిన ఆశా అనే వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు వివిధ సాకులతో పింఛన్ మంజూరు చేయలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. అంతేగాకుండా ఇలాంటి వారు నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది ఉండొచ్చన్నారు. ఎవరికైనా సమస్య పరిష్కారం కాని పక్షంలో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతురెడ్డి, బిలాల్, మహబూబ్‌బాషా, వసంత్‌కుమార్ గౌడ, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించండి

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ



రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు అన్నివిధాలుగా తోడ్పాటు అందించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ కోరారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో అనంతపురం ఉమ్మడి జిల్లా 2025-26 వార్షిక బడ్జెట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 గ్రంథాలయాల ద్వారా ప్రజలు, పాఠకులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో దాతలు, స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకొచ్చి గ్రంథాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు నిధులు సమకూర్చిన దాతల పేర్లుగానీ, వారు సూచించిన పేర్లను సంబంధిత గ్రంథాలయాలకు నామకరణం చేయనున్నట్లు తెలిపారు. ఇకపోతే గ్రంథాలయాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిలో సమన్వయం కొరవడిందన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ద్వారా గ్రంథాలయాలకు రావాల్సిన బకాయి పనులను వసూలు చేయాలన్నారు. అనంతరం గ్రంథాలయాల వార్షిక ఆదాయ, వ్యయాలపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.17.12 కోట్ల బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. వీటితో గ్రంథాలయాలు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రానున్న సమావేశానికి సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ముందస్తుగా తనకు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీని తనిఖీ చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ సభ్యులు, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్, డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు, డిపిఒ ఎఒ సోమశేఖర్, సమాచార శాఖ ఎపిఆర్ఒ ఫక్రుద్దీన్, డిప్యూటీ లైబ్రరీ కమ్మన్న కిరణ్, రామాంజనమ్మ, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 'పోరుబాట'

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పేద విద్యార్థులకు మెడికల్ కోర్సులు దూరం చేసేలా మెడికల్ కళాశాలలు ప్రయివేట్ పరం చేయాడాన్ని నిరసిస్తూ మాజీ సిఎం జగన్ అధ్వర్యంలో పోరుబాట నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన అనుభవంతో సంపద సృష్టించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని అధికారంలోకి వచ్చిన సిఎం చంద్రబాబు నాశనం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం వైసిపి హయాంలోనే రూ.3వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. దశలవారీగా మరో రూ.5వేల కోట్లు ఖర్చు చేయలేక పిపిపి మోడల్ పేరుతో మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. విలువైన భూములను తనకు కావాల్సిన వాళ్లు, బినామీలకు కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు. పిపిపి అంటే పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్‌షిప్ కాదని, ప్రజాధనాన్ని పీల్చి పిప్పి చేసి పిండుకోవడమే అనేది చంద్రబాబు విధానమన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు పెద్దఎత్తున నష్టపోతాయన్నారు. పేద విద్యార్థులు ఎంబిబిఎస్ చదువుకోవాలంటే కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. కావున మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ చేపట్టనున్న పోరుబాటలో మేథావులు, వామక్షాలు, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇకపోతే సంపాదనే ధ్యేయంగా ఏడాదిన్నరగా కూటమి పాలన సాగుతోందన్నారు. గత ప్రభుత్వంలో లిక్కర్ స్కాం జరిగిందని ప్రచారం చేస్తున్నా నాయకులకు అసలైన లిక్కర్ స్కాం ఎలా చేస్తున్నారో ములకలచెరువు, ఇబ్రహీం పట్నంలో వెలుగు చూసిందన్నారు.

నమ్మిమద్దతు ఇచ్చాం..న్యాయంచేయాల్సిందే..

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గత వైసిపి ప్రభుత్వంలో తమ సమస్యలు పట్టించుకోకపోవడంతో నమ్మి కూటమి ప్రభుత్వానికి ఏకతాటిగా మద్దతు ఇచ్చి గెలిపించాం.. తప్పనిసరిగా సమస్యలు పరిష్కరించాల్సిందే అని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగలోపు పెన్షనర్లకు రావాల్సిన సౌకర్యాలన్నీ కల్పించాలన్నారు. లేకపోతే ఉద్యమ బాట పడుతామని హెచ్చరించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్ మాట్లాడుతూ సంఘంతోనే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని, గతంలో ఇచ్చిన మాదిరిగా అడిషనల్ క్వాంటమ్ పెంచుట, పిఆర్‌సి కమిటీ, మధ్యంతర భృతి, మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.5లక్షలకు పెంపు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మృతిచెందిన పెన్షనర్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రామకృష్ణ, వివిధ ప్రాంతాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు సత్యప్రసాద్‌రెడ్డి, రాయుడు, నారాయణ, తిప్పేస్వామి, సత్యనారాయణ, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్




వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి నుంచి ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్‌నాయక్, సెక్రటరీ జనరల్ పురుషోత్తం తెలిపారు. ఈమేరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌ను గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయుల హాజరు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, బోధన వంటి పనులు మాత్రమే చేస్తారన్నారు. మిగిలిన బోధనేతర పనులన్నీ బహిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు రత్నం, రమణారెడ్డి, సిరాజ్, రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సూర్యుడు, ఫణిభూషణ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనుకాకుండా విధుల్లో పని భారాన్ని తాగించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో మండల విద్యాధికారి హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు యు.శ్రీనివాసులు, చెక్కే తిప్పేస్వామి, బి.తిప్పేస్వామి, హనుమంతునాయక్, సురేష్‌కుమార్, ఓబుల్‌పతి, వజీర్‌బాషా, బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తే గుర్తింపు

ప్రజాశక్తి-గుత్తి



మొక్క నాటి నీరు పోస్తున్న గురువయ్య

ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య సూచంచారు. గురువారం స్థానికఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ విద్యుత్ కనెక్షన్లపై దాడులు నిర్వహించి వాటిని క్రమబద్ధీకరించాలన్నారు. విద్యుత్ బిల్లులను పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. బాధ్యత రహితంగా వ్యవహరిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిటిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభపిళ్లై, ఎడిఇ సాయిశంకర్, ఎఇ కె.మధుసూదన్‌రావు, డివిజన్ పరిధిలోని ఎడిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి

యాడికి : టపాసుల దుకాణాల యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని అధికారులు, టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాసుల విక్రయ కేంద్రాలు పూర్తిగా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. పేలుడు పదార్థాల భద్రతకు సంబంధించిన నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, సీఐ ఈరన్న, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో మధు, టపాసుల విక్రయదారులు జోగిరెడ్డి, గణపతి, సుదర్శన్ ఖాజా, నాగరాజునాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

మాంఛూఫెర్రర్‌ను కలిసిన టిడిపి ఎమ్మెల్యేలు

శింగనమల : ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మాంచూఫెర్రర్‌ను ఉమ్మడి అనంతపురం టిడిపి ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆర్‌డిసి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ విషయంలో కేంద్రం వద్దకు తీసుకెళ్లిన విషయాలు, అసెంబ్లీలో చర్చించిన విషయాలు, కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరు, కేంద్ర మంత్రులు అందించిన సహాయ, సహకారాల గురించి ఫెర్రర్‌కు చర్చించారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి శుభవార్త వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాంచూఫెర్రర్‌ను కలిసిన వారిలో ఎంఎస్.రాజు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తదితరులు ఉన్నారు.

అత్యుత్తమ సేవలకు కట్టుబడి ఉన్నాం

పుట్లూరు : ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని పుట్లూరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శామ్యూల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రాష్ట్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, కనా గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడినట్లు తెలిపారు. కావున ఈనెల 9వతేదీన సాయంత్రం 6 నుంచి 13వతేదీ ఉదయం 10 గంటల వరకు అన్ని ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీ సేవలు అందుబాటులో ఉండవన్నారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన రూ.16,61,086 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మండలంలోని కడవకల్లు, గోపురాజుపల్లి గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి.

నేడు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరానికి తాగు నీటినీ సరఫరా చేసే పిఎబిఆర్ తాగునీటి పథకానికి కొడిమి సమీపంలో సిప్లాన్ కెమికల్ ఫ్యాక్టరీ వద్ద వాల్వ్ రిపేరీ కారణంగా శుక్రవారం సాయంత్రం నీటి సరఫరాకు అంతరాయము కలుగుతుందని కమిషనర్ బాలస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

ఆదాయ వనరులను పెంపొందిస్తూనే పౌరసేవలు

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



మాట్లాడుతున్న అహుడా ఛైర్మన్, వైస్ ఛైర్మన్

ఆదాయ వనరులను పెంపొందిస్తూనే విస్తృత పౌరసేవలు అందించేందుకు కృషి చేయాలని అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. గురువారం అనంతపురం అహుడా కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా భవిష్యత్ కార్యాచరణపై అనేక అంశాలను ప్రస్తావిస్తూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకతే ప్రామాణికంగా వెబ్‌సైట్ ద్వారా అహుడా కార్యక్రమాలను పొందుపరచాలన్నారు. ఇకపై అహుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే లేఅవుట్‌లలో ప్లాట్ల విక్రయానికి ఈ యాక్షన్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎన్టీఆర్ ఎంఐజి లేఔట్స్‌తో పాటు నూతనంగా అహుడా ఆధ్వర్యంలో కదిరి, కళ్యాణదుర్గం, గుమ్మగట్ట, రాచనాపల్లి తదితర ప్రాంతాల్లో మరిన్ని లేఅవుట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్వయంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టిసి వరుణ్ తెలిపారు. అనంతపురంలో అతి త్వరలోనే మహిళల కోసం పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు హౌసింగ్ బోర్డులో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలకు సంబంధించి త్వరలో జరగనున్న అథారిటీ సమావేశంలో ఆమోద ముద్ర వేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఇఇ దుష్యంత్, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, డిఇ రేవంత్, జెపిఒ హరీష్‌చౌదరి, సర్వేయర్ శరత్‌బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బెలుగుప్ప : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలని తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తహశీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వైద్యులు హాజరు పట్టికను పరిశీలించారు. డాక్టర్లు సమ్మెలో ఉన్నందున బెలుగుప్ప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి ఇన్‌ఛార్జిగా వైద్యాధికారి నరేంద్రను నియమించారన్నారు. అయితే సంబంధిత డాక్టర్ బుధవారం మాత్రమే విధులకు హాజరై వెళ్లిపోయారన్నారు. మరో ముగ్గురు కూడా విధులకు డుమ్మా కొట్టడంతో జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నగేష్‌బాబు, పిహెచ్‌ఎన్ఇఒ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది సరోజమ్మ, భాగ్యమ్మ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలపై శిక్షణ

పామిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మట్టి నమూనాల పరీక్షలపై 7, 8, 9, 11వ తరగతి విద్యార్థులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పి.శ్రీనాథ్‌రెడ్డి మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు, మట్టి పరీక్షల హెల్త్‌కార్డు, తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం నుంచి బి.ఆర్ శేఖర్‌రెడ్డి, భూసార పరీక్ష కేంద్రం ఏవో నివేదిత, మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, పామిడి మోడల్ స్కూల్ సైన్స్ టీచర్ శశికిరణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది భార్గవ్ పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

బ్రహ్మసముద్రం : సంక్షేమ పథకాల అమలుతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ఒక్క సిఎం చంద్రబాబుతో సాధ్యమని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నీలాస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని బొబ్బర్లపల్లి-కోటిపల్లి గ్రామాల మధ్య బిటిపి కాలువ పనులను పరిశీలించారు. అనంతరం రైతులను కలిసి పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి పట్టాలెక్కిందన్నారు. ముఖ్యంగా సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యదర్శి కురు గౌడ, మాజీసర్పంచు అభ్యర్థి చంద్రన్న, గుండిగానిపల్లి ప్రజలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న నాలాస్వామి

జీవితంలో భాగమైన స్పేస్ టెక్నాలజీ

జెఎన్‌టియు అధ్యాపకులు కళ్యాణి రాధ, ఓంప్రకాష్

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న కళ్యాణిరాధ

దైనందిన జీవితంలో స్పేస్ టెక్నాలజీ భాగం కానుందని జెఎన్‌టియు మెకానికల్ అధ్యాపకులు కళ్యాణి రాధ, ఓంప్రకాష్ అన్నారు. గురువారం నగరంలోని మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 'కంప్యూటర్, టెక్నాలజీ - అవర్ స్మార్ట్ హెల్ప్ నెస్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి కంప్యూటర్, టెక్నాలజీ ఆవశ్యకతను వివరిస్తూ టెక్నాలజీ అభివృద్ధి గురించి విద్యా, వ్యవసాయ రంగానికి సంబంధించి, స్పేస్ టెక్నాలజీ మన దైనందిన జీవితంలో ప్రాముఖ్యతను వివరించారు ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణభరత్, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, స్కూల్ అకాడమిక్ డీన్ మధు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

షెడ్డులో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని ఓబులాచారి రోడ్డులో ఉన్న పోస్టాఫీస్ సమీపంలో ఓ రేకులషెడ్డులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. తిమ్మారెడ్డి అను వ్యక్తి ఈ షెడ్డులో ఒక బుక్‌స్టాల్, స్టేషనరీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి వ్యాపారం అనంతరం షెడ్డుకు తాళం వేసుకుని వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం షెడ్డు తలుపు తెరిచేటప్పటికీ వెనకవైపున ఇనుప రేకు కత్తిరించి ఉండటం తిమ్మారెడ్డి గుర్తించాడు. షెడ్డులోని నగదు పెట్టిలో నిల్వ ఉంచిన రూ.ఐదువేల నగదును చోరీ జరిగినట్లు తిమ్మారెడ్డి తెలిపారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి రూరల్ : మట్కాబీటర్‌ను అరెస్టు చేసి రూ.17150 స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి మండలం చిన్న పొలమడకు చెందిన వేల్పుల రంగనాయకులు రూరల్ పరిధిలోని చుక్కలూరు క్రాస్ దగ్గర మట్కా రాస్తున్నాడన్న సమాచారంతో తాడిపత్రి సబ్ డివిజన్ స్పెషల్ బృందం అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి నగదు, మట్కా చీటీలు, పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నంలో 10మందిపై కేసు

యాడికి : మండలంలోని వెంగన్నపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో విశ్వనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని పాఠశాల మధ్యాహ్న భోజనం ఏజెన్సీ విషయంలో బుధవారం జరిగిన గొడవల్లో విశ్వనాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన రామేశ్వర్‌రెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, అప్పిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మీదేవితోపాటు మరో నలుగురుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.